క్లుప్తంగా

సూర్యదేవుని దర్శించుకున్న మంత్రి వేణు



జి.మామిడాడ సూర్యదేవాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి వేణు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు మంత్రికి వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ దేవుని దయ, ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి మళ్లీ అఖండ విజయం సాధిస్తారన్నారు. ఆంధ్రాను సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో అగ్రగామిగా నిలుపుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి, గనిరెడ్డి, పెద్ద చిన్నారెడ్డి, పప్పు చిన్నారెడ్డి, రాయుడు వీర్రాఘవులు, నారాయణరెడ్డి, చక్రి, ద్వారంపూడి మాధవరెడ్డి, అనుసూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



గంద్రేడులో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో జ్యోతి

పెదపూడి: కిశోర బాలికలు నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ అనుసూరి జ్యోతి తెలిపారు. గురువారం గంద్రేడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రుతుక్రమ పరిశుభ్రతపై కిశోర బాలికలు, తల్లులకు అవగాహన సదస్సు, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అనుసూరి జ్యోతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే వచ్చే ప్రమాదాల గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. నెలసరి సమయంలో మహిళలను అంటరానివారిగా చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సునంద, రాజేశ్వరి, భవాని, అనన్య, శేషకుమారి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామానుజం

రాజానగరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయని గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామానుజం అన్నారు. కళాశాలలో గురువారం జాబ్ ఎచీవర్స్ డే నిర్వహించారు. తమ కళాశాలలో పాలిటెక్నిక్ చదివిన 144 మంది విద్యార్థులు టర్బో ఎనర్జీస్, అమర్ రాజా, లూకాస్, టీవీఎస్, సర్వోమేథ, టాఫ్ వంటి సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ అధికారి కె.వివేక్, రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ అధికారి వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి

కంబాలచెరువు: త్వరలో ఏర్పాటు కానున్న కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల దేశంలోనూ, రాష్ట్రంలోనూ న్యాయవాదులపై దాడులు జరగడం చాలా దారుణమన్నారు. ఎల్లప్పుడూ న్యాయ పరిరక్షణకు కృషి చేసే న్యాయవాదులకు రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. త్వరలో రానున్న ప్రభుత్వం పార్లమెంట్‌లో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని కోరారు. సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యులకు మాదిరిగా న్యాయవాదులకూ రక్షణ చట్టం అవసరమన్నారు. దీని సాధనకు ఎటువంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీర అరుణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో, ప్రభుత్వ పరిపాలనలో న్యాయవాదులదే కీలక పాత్ర అన్నారు. అటువంటి న్యాయవాదులకు రక్షణ లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర నాయకులు కూసరెడ్డి హేమంత్ శ్రీనివాస్, లంక అయ్యప్ప, ఎస్ఎస్‌వీ. ప్రసాద్, సాయిప్రశాంత్, కె.వెంకటరమణ, మొగ్గ శ్రీను, వీఆర్ఆర్ నరేంద్ర పాల్గొన్నారు.

సారాక్షసికి కళ్లెం

- సారా నిర్మూలనకు సెబ్ చర్యలు
- ఎన్నికల సందర్భంగా 120 కేసుల నమోదు
- 120 మంది నిందితుల అరెస్టు
- ఏడాది కాలంలో ఐదుగురిపై పీడీ యాక్టు



నర్సాపురం శివారు సారా బట్టీపై దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్న సిబ్బంది(ఫైల్)

మధురపూడి: పేదల బతుకుల్ని సారకసి చిన్నాభిన్నం చేస్తోంది. నాటుసారాకు బానిసలైన వారు ఇల్లు గుల్ల చేస్తూ, భార్యాబిడ్డల జీవితాలను సైతం రోడ్డుకీడుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఈ మహమ్మారి కారణంగా దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. సమాజాన్ని పట్టిపీడిస్తున్న నాటు సారా నియంత్రణకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. కూలీ నాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదల ఆరోగ్యాన్ని నాటుసారా నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే వివిధ గ్రామాల్లో నాటుసారాను నియంత్రించేందుకు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి విస్తృతాధికారాలు కల్పించింది. పల్లెలను సారా రహితంగా తీర్చిదిద్దడానికి సెబ్ కృషి చేస్తోంది. సెబ్ కోరుకొండ సర్కిల్ పరిధిలోని కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో 60 గ్రామాలు ఉన్నాయి.

మారుమూల గ్రామాలే కీలకం

నాటు సారా తయారీదార్లకు మారుమూల గ్రామాలే కీలకంగా ఉన్నాయి. గోదావరి లంక గ్రామాలు, శివారు గ్రామాలు, అటవీ ప్రాంతాలు, తోటలు, మెట్ట ప్రాంతాలను సారా తయారీకి స్థావరాలుగా ఎంచుకుంటున్నారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండల్లాలోని గుమ్ములూరు, బుచ్చెంపేట, బొబ్బిల్లంక, ములకల్లంక, తిరుమలాయపాలెం, వెదురుపాక, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, గాదరాడ, కణుపూరు, రాజవరం తదితర గ్రామాల్లో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం. దాదాపు జన సంచారం లేని ప్రాంతాలనే వీరు త యారీ స్థావరాలుగా ఎంచుకుంటారు. కొన్ని మారు మూల ప్రదేశాలు, అటవీ ప్రాంతాలైతే సాధారణ మ నుషులు ప్రవేశించేందుకు కూడా సాహసించని ప్రాంతాలు ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో తయారు చేస్తు న్న సరకును తెల్లవారుజాము, రాత్రి వేళల్లో సరిహద్దులు దాటించి, వివిధ చోట్ల విక్రయదారులకు చేరవేస్తున్నారు.

రహస్య మార్గాల ద్వారా..

సారా తయారీకి నల్లబెల్లం, అమోనియాను వినియోగిస్తారు. వీటిని నీటితో కలిపి ఊటను సిద్ధం చేస్తారు. నాలుగు నుంచి వారం రోజుల పాటు పులియబెట్టి, సారా తయారీకి వినియోగిస్తారు. ఆయా ముడి సరకులను వేర్వేరు ప్రాంతాల నుంచి భారీగా సారా తయారీ స్థావరాలకు రహస్య మార్గాల్లో చేరవేస్తుంటారు. అలాగే తయారు చేసిన సారాను రవాణా చేసే సందర్భాల్లో కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తారు. సరకు రవాణా చేసేముందు ఆ మార్గంలో రెక్కీ నిర్వహిస్తారు. ఎక్సైజ్, సెబ్, పోలీసుల కదలికలతో పాటు సారాను వ్యతిరేకించే వ్యక్తుల సమాచారంపైనా దృష్టి పెడతారు. వారికి ఏమైనా అనుమానం వస్తే.. సారా రవాణాను నిలిపివేస్తారు. అంతేగాక సారాను జన సందడి ఉన్న ప్రాంతాల మీదుగా తరలించేందుకు సాహసించరు, సారా రవాణాకు తరచూ మార్గాలను మారుస్తుంటారు. సారా రవాణా, రెక్కీ చేసే వారంతా రికార్డుల్లేని మోటార్ సైకిళ్లను ఉపయోగిస్తారు. వీటిలో ఎక్కువగా చోరీకి గురైన వాహనాలు ఉంటాయి. వీటికి ఎటువంటి అనుమతులూ ఉండవు.

సారా స్థావరాలపై దాడి

రంగంపేట: మండలంలోని వివిధ గ్రామాల్లోని సారా స్థావరాలపై గురువారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట గ్రామంలో పంపన సత్యనారాయణ వద్ద 20 లీటర్ల సారా, దొడ్డిగుంట గ్రామానికి చెందిన చలబోయిన వెంకన్నబాబు వద్ద నుంచి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ జి.అనిల్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.



సీతానగరం లంక గ్రామాల్లో దాడులు చేసి, సారాను స్వాధీనం చేసుకుని బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు(ఫైల్)

నియంత్రణకు విస్తృత దాడులు



సారా రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి విస్తృత దాడులు నిర్వహిస్తున్నాం. కోరుకొండ సర్కిల్ పరిధిలో ఎన్నికల షెడ్యూల్ ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకూ 120 మందిపై 120 కేసులు నమోదు చేశాం. వీరిని కోర్టు ద్వారా జైలుకు పంపించాం. ఆయా దాడుల్లో 1,500 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నాం. 20 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశాం. అలాగే గ్రామాల్లో ప్రత్యేక కమిటీలను నియమించడం ద్వారా వారి సమాచారాన్ని సేకరిస్తున్నాం. సారా నిర్మూలనలో భాగంగా పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నాం. గతేడాది సారా వ్యాపారాన్ని నిత్యం సాగిస్తున్న ఐదుగురిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేశాం.

– బంగారురాజు, కోరుకొండ సీఐ, సెబ్

యువతను భాగస్వాముల్ని చేసి..



సారా నిర్మూలనకు యువతను భాగస్వాముల్ని చేస్తున్నాం. సారా కారణంగా పచ్చటి పల్లెల్లో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. సెబ్ ద్వారా చాలా వరకు సారా అరికట్టబడింది. సారా వ్యాపారాలూ తగ్గుముఖం పట్టాయి. నిత్యం దాడులు నిర్వహించడం, నిరంతరం సారా వ్యాపారులపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయడంతో చాలామంది భయపడి వెనక్కుతగ్గారు. ఇంకా మరిన్ని చర్యలు చేపట్టాలి. యువత దీనికి బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– బుడ్డిగ సత్తిబాబు, పీఏసీఎస్ ఛైర్మన్, బూరుగుపూడి

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు



సమీక్షలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో మూడు జిల్లాల ఎస్పీలు

- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టండి
- మూడు జిల్లాల ఎస్పీల సమీక్షలో అడిషనల్ డీజీపీ శంఖబ్రత బాగ్చి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర అడిషనల్ డీజీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మూడు జిల్లాల ఎస్పీలతో రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ప్రత్యేక నిఘా అవసరమన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకూ నిరంతరం వాహన తనిఖీలు, మాక్ డ్రిల్స్, ఫ్లాగ్‌మార్చ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాల పోలీసు యంత్రాంగమంతా నిష్పక్షపాతంగా పనిచేసి, పోలీసుల గౌరవాన్ని పెంచాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని విధాలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత ఎలక్షన్ నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎలక్షన్ కేసులపై పురోగతిని సాధించాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, ఎన్నికల సంఘ నిబంధనలను ఉల్లంఘించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తామన్నారు. సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్,, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్, మూడు జిల్లాల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

సాయిబాబా సన్నిధిలో చిన్నారులకు తులాభారం



నరేంద్రపురానికి చెందిన నరాల బుజ్జికి తులాభారం వేస్తున్న భక్తులు

రాజానగరం: వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో తమ చిన్నారులకు పటిక బెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడకు వచ్చి త్రికరణ శుద్ధిగా బాబాను స్మరించుకుంటే, మనస్సున కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. నరేంద్రపురానికి చెందిన నరాల బుజ్జి, కోలమూరుకు చెందిన జ్ఞాన్విక, మరికొందరికి తులాభారం వేశారు. ఇలాఉండగా గురువారం కావడంతో ఆలయంలో వేకువజాము నుంచీ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. మధ్యాహ్న హారతి అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నంది అవార్డు అందుకున్న సీహెచ్‌ఓ జయమణి



సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జయమణి

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీహెచ్‌ఓగా పని చేస్తున్న కె.జయమణి కరోనా సమయంలో చేసిన సేవలకు గాను నంది అవార్డు అందుకున్నారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆమెకు నంది అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను రంగంపేట పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మి, చిన్నారావు, వైద్య సిబ్బంది అభినందించారు.

మండ చిట్టిబాబుకు ఎమ్మెల్యే నివాళులు



మండ చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి మండ బేబిరాణి భర్త చిట్టిబాబు గతేడాది మృతి చెందారు. గురువారం చిట్టిబాబు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పరామర్శ



జెడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండల జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి అత్త, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తల్లి ఎరుకమ్మ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి కుటుంబ సభ్యులను పందలపాకలోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుల్లెబ్బాయిరెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శ



బుల్లెబ్బాయిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అద్దంకి ముక్తేశ్వరరావు

పెదపూడి: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయిరెడ్డి కుటుంబ సభ్యులను యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు పరామర్శించారు. బుల్లెబ్బాయిరెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు మాట్లాడుతూ పెదపూడి మండలాభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయిరెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పెదపూడి పీఏసీఎస్ ఛైర్మన్ మార్ని కామరాజుచౌదరి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పుట్టా కాశీరాజు, మాజీ సర్పంచ్‌లు నూని సత్యనారాయణ, కొల్లు పెద్దకాపు, పేపకాయల నాయుడు, బద్దా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసుల్లో ఇద్దరి అరెస్టు

సీతానగరం: ముగ్గళ్లలో ఎస్సై టి.రామకృష్ణ, ఏఎస్సై సమర్పణరావు వేర్వేరుగా జరిపిన దాడుల్లో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. గురువారం ముగ్గళ్లలో మాగాపు దశరథుడు ఇంటిలో ఉన్న 25 లీటర్ల నాటుసారాను ఎస్సై రామకృష్ణ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అదే విధంగా ఈతకోట అచ్చియ్యమ్మ ఇంటిలో ఉన్న ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఏఎస్సై సమర్పణరావు కేసు నమోదు చేశారు.

పోషక విలువలు గల భోజనం తయారుచేయాలి



మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న వెంకట్రాజు

రంగంపేట: ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, పోషక విలువలు గల భోజనం తయారు చేయాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా సహాయ సంచాలకులు వి.వెంకట్రాజు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా భావంతో విద్యార్థులకు రుచికరంగా వంటలు తయారుచేస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వంట సామగ్రికి ఇచ్చే ధరలు, తమ గౌరవ వేతనాలు పెంచాలని, ఏకరూప దుస్తులు, ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ అందించాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు అమ్మాజీ కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వెంకటరాజు హామీ ఇచ్చారు. నూతన మెనూ ప్రకారం శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిత్తశుద్ధితో అమలుపరచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు కోరారు. నూతన మెనూ విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వీడియో ప్రదర్శనతో పాటు ప్రయోగాత్మకంగాను అవగాహన కల్పించారు. సమావేశంలో ఎండీఎం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారి–2 పి.మధుసూదనరావు, హైస్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వరలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

అందం మాటున గండం

- గోదావరిలో పొంచి ఉన్న దొంగ ఊబిలు
- ఇసుక తిన్నెల మధ్యన దాగి ఉన్న అపాయం
- స్నానఘట్టాల్లో పోలీసుల హెచ్చరికలు
- దశాబ్ద కాలంలో 60 మందిని బలిగొన్న మృత్యువు



కాటన్ బ్యారేజ్ దిగువన స్నానాలు చేస్తున్న యువకులు

ధవళేశ్వరం: చుట్టూ ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలు.. గోదావరి నది.. అక్కడక్కడా బయటపడిన ఇసుక తిన్నెలు.. ఇవన్నీ ఒకవైపు మాత్రమే. మరోవైపు.. ఆకట్టుకునే ఈ ప్రకృతి సోయగాల నడుమ దాగి ఉన్న మృత్యు గండాలు కంటికి కానరాని దొంగ ఊబిలు. వీటి బారిన పడి ఏటా అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. గోదావరిలో పొంచి ఉన్న దొంగ ఊబిలపై ఈ కథనం.

కాటన్ బ్యారేజ్ దిగువ, ధవళేశ్వరంలోని స్నాన ఘట్టాల్లో దొంగ ఊబిలతో అనేక మంది మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే గోదావరి ఇసుక తిన్నెల మాటున ప్రమాదం పొంచి ఉంది. వేసవి కాలం కావడంతో గోదావరి నీటి ప్రవాహం తగ్గి, బ్యారేజ్ దిగువ ఇసుక తిన్నెలు పైకి తేలాయి. వేసవిలో సాయంత్రం వేళ సేద తీరేందుకు కాటన్ బ్యారేజ్‌కు వచ్చేవారికి ఆ ఇసుక తిన్నెలు మరింత ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందజేస్తున్నాయి. ఈ ఆహ్లాదం మాటున ప్రమాదం పొంచి ఉంది. స్నాన ఘట్టాల్లో ఈతకు వెళ్లే వారు ఈ ఊబిలకు చిక్కి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో 60 మందికి పైగా ఈ ఊబిల్లో చిక్కి ప్రాణాలు కోల్పోయారంటే ప్రమాద తీవ్రత ఏపాటిదో అవగతమవుతుంది.



ధవళేశ్వరంలోని స్నానఘట్టాల వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు



బ్యారేజ్ దిగువన ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సేద తీరేందుకు వచ్చి..

కాటన్ బ్యారేజ్, స్నాన ఘట్టాల వద్ద ఇప్పటికే ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ దిగువన ఇసుక తిన్నెలు నీటి ప్రవాహం లేకపోవడంతో పైకి కనిపిస్తుంటాయి. బ్యారేజ్‌ను చూసేందుకు వచ్చే పర్యాటకులు, సాయంత్రం వేళ సేద తీరేందుకు వచ్చే స్థానికులు ఈ ఇసుక తిన్నెలకు, గేట్లు దిగువ ఉన్న నీటి కుంటలకు ఆకర్షితులై కిందకు వెళుతున్నారు. ఇసుక తిన్నెల్లో కొంతసేపు సేద తీరుతున్నారు. అనంతరం ఇసుక తిన్నెల మధ్యన ఉన్న గోదావరి నీటిలో స్నానానికి దిగుతున్నారు.

హెచ్చరికలను లెక్కచేయక..

ముఖ్యంగా ఇసుక తిన్నెల మధ్యలో దొంగ ఊబిలు ఉండటంతో అనేక మంది స్నానానికి దిగి ప్రాణాలను కోల్పోతున్నారు. గడిచిన పదేళ్ల కాలంలో కాటన్ బ్యారేజ్ దిగువ, స్నాన ఘట్టాల్లో సుమారు 60 మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఇరిగేషన్ అధికారులు బ్యారేజ్ దిగువన దొంగ ఊబిలు ఉన్నాయని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులనూ అనేక మంది లెక్కచేయడం లేదు. తూర్పు డెల్టా లాక్ నుంచి బ్యారేజ్ దిగువకు వెళ్ళే మార్గాన్ని సైతం మూసివేసి హెచ్చరిక బోర్డులను పెట్టారు. ధవళేశ్వరంలోని అపాయకర స్నాన ఘట్టాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్నానానికి వెళ్లేవారు ఒడ్డునే చేయాలని సూచిస్తున్నారు.

అప్రమత్తత అవసరం

కాటన్ బ్యారేజ్ చూసేందుకు వచ్చే పర్యాటకులు, స్థానికులు దిగువన ఉన్న దొంగ ఊబిలతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. బ్యారేజ్ దిగువ స్నానాలకు దిగవద్దని ఇసుక తిన్నెల్లో ప్రమాదకరమై ఊబిలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. వేసవి తాపంతో యువత స్నాన ఘట్టాల్లో ఈతకు, స్నానాలకు లోతుకు వెళ్లవద్దని పోలీసులు చెబుతున్నారు.

హద్దు మీరవద్దు



స్నాన ఘట్టాల్లో, బ్యారేజ్ వద్ద హెచ్చరికలను పాటించాలి. హద్దు మీరితే ఉపేక్షించేది లేదు. స్నాన ఘట్టాల్లో దొంగ ఊబిలు ఉన్నాయి. ఒడ్డునే స్నానం చేయాలి. బ్యారేజ్ దిగువకు స్నానానికి వెళ్లడం అపాయకరం. దిగువ ఇసుక తిన్నెల్లో దొంగ ఊబిలు ఉండటంతో ఇరిగేషన్ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. స్నాన ఘట్టాల్లో దొంగ ఊబిలు ఉన్నాయని పోలీస్ శాఖ ఆధ్వర్యంలోనూ బోర్డులు పెట్టారు.

– జీవీ వినయ్‌మోహన్, సీఐ, ధవళేశ్వరం